# 15 ముల్కీ — టోపీదాసులు

వెనుక యాదవకులాన్ని సర్వనాశనం చేశాక, కారణ జన్మురాలైన ఆ "ముసలం" బ్రహ్మదేవుడి దగ్గరకెళ్ళి మొర పెట్టుకుందట !

"స్వామీ ! నాకు అప్పగించిన చరిత్రాత్మక కర్తవ్యాన్ని జేమ్స్‌బాండ్ నాయనమ్మలా పూర్తి చేసుకొచ్చాను. కానీ, యాదవకులం దుంప నాశనం అయినా నా దురద మాత్రం ఇంకా తీరలేదు. ఇంకెవర్నైనా చూపించండి స్వామీ! వాళ్ళ దుంప కూడా తెంపి దురద తీర్చుకు వస్తాను" అని!

అప్పుడు బ్రహ్మదేవుడు నాలుగు తలకాయల్తోనూ సీరియస్‌గా ఆలోచించి, నారదులవారి సలహా కూడా పుచ్చుకుని ఇలా సెలవిచ్చాడట!

"ఓ ముసలమా! నీవు కలియుగంలో, భరత ఖండంలో, హైదరాబాదు సంస్థానంలో, కింగ్ కోఠీలో జన్మించి మహా ఘనత వహించిన నిజాంనవాబుగారి దివాణంలో అల్లారు ముద్దుగా పెరిగెదవు గాక! నీవు యుక్త వయస్కురాలి వగులోగా తెలుగుజాతి నానా త్యాగాలు చేసి ఏకమగుగాక! అప్పుడు నీవు తీరికగా వారికి తెగులు పుట్టునట్లు చేసి నీ దురద

యథావిధిని తీర్చుకుందువు గాక !" అని వరమిచ్చి పంపేశా డట!

ఈ పురాణ గాథ నవాబుగారి పాత శాసనాల కవిలె కట్టల్లోనే ఉన్నా దాని ప్రభావం మాత్రం మన కళ్ళముందే ఉంది గనుక అబద్ధం అనలేం.

ఇప్పటికే ఈ ముల్కి ముసలం తెలుగువాళ్ళ మధ్య అడపా దడపా కొన్ని చిల్లర దెబ్బలాటలు తెచ్చిపెట్టింది. అయితే ఈసారి వచ్చిన తాజా ముసలం చిల్లర వ్యవహారంగాక స్పెషల్ ముసలంగా తయారై కూర్చుంది.

తెనుగుభాష అంటేనే వాంతులు చేసుకునేలా ద్వేషించి తెలుగు వాళ్ళని ఘోరంగా దోచుకుని, ప్రపంచంలోకెల్లా ధనికుడుగా వెలిగిపోయిన "ముల్కీపిత" నిజాంనవాబు ఈనాడు లేడు. వాడి పిడికిట్లో నలిగిపోయి తన సారాన్నంతా వాడి ఖజానాకు ధారవోసిన హైదరాబాద్ సంస్థానం ఈనాడు లేదు. కానీ, అమాయక ప్రజల పాలిటి ముసలంలా ముల్కీరూల్స్ మాత్రం మిగిలి ఉన్నాయి.

అలనాడు కృష్ణ, బలరామాధి యాదవ లీడర్లు ముసలా ధిక్కృతను మన్నించి మర్యాదగా "జనంతో పాటే మనం" అనుకుని అమరిపురి కేతెంచారు.

కానీ, ఈనాటి మన మహానాయకులు ఎత్తుల్లో, జిత్తుల్లో టోపీలు పెట్టటంలో ఆ కుటిల కృష్ణుడిని తలదన్నిన ఘనులు.

జనం తన్నుకు చస్తే కనీసం ఆ శవాల్ని పీక్కుతినేందుకన్నా మేం మంత్రులుగా బ్రదికి ఉండొద్దా! అని ప్రశ్నించగల అవతార పురుషులు, బాధ్యత ఎంత లాగినా టోపీని, సింహాసనాన్ని పట్టుకుని వదలని మాడరన్ మార్కండేయులు వీళ్ళు. నిజానికి ముల్కీ ముసలాన్ని గానీ, మరే ముసలాన్ని గానీ అడపా దడపా తట్టి నిద్రలేపే ఘనులు వీరే. ముల్కీ వల్ల క్రొత్తగా ఎందరికి ఉద్యోగాలు దొరుకుతాయనేది సందేహమే గానీ ఆ ముసలాన్నలాగే ఉండనిచ్చి అడపా దడపా నిద్రలేపి అయిన వాళ్ళందర్నీ అలసిపోయేలా తన్నుకోనిస్తే రాజకీయ సన్యాసులకు మాత్రం కొందరికి ఉద్యోగాలూడి మరి కొందరికి ఉద్యోగాలు దొరుకుతాయనే కిటుకును తెలివైన టోపీదాసులు ఏనాడో గ్రహించేశారు.

అందుకే ఇక్కడ తెలుగుజాతి అమాయకంగా తన్నుకు చస్తూంటే ఈ టోపీదాసులు మాత్రం నిశ్చింతగా ప్రజల డబ్బుతో పుష్పక విమానాలెక్కి కురుక్షేత్ర యాత్రలు సాగిస్తున్నారు అక్కడ వాయినాల పంపకంలో వాటాలకోసం జాతి గౌరవాన్ని, ఆత్మీయతను, భవిష్యత్తును పణంపెట్టి జూదమాడుతున్నారు.

మన ఖర్మకొద్దీ మన మహానాయకులైన ఈ టోపీదాసులకు కావల్సింది రాజకీయ నిరుద్యోగులకు ఏదో విధంగా పునరావాసమేగానీ ప్రజలకు బ్రతుకుబాట చూపటం గాదు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు చూపటం అంతకన్నా కాదు.

గతంలో రెండేళ్ళపాటు ఇలాగే ప్రజలోని అసంతృప్తిని తెలివిగా వాడుకొని కొందరు తెలివైన వాళ్ళు పీటలు సంపాదించుకున్నారు. వాళ్ళు పీటలెక్కగానే చేసినపని ప్రజలకు పల్లకీ పట్టడంగాదు, ప్రజల చేత పల్లకీ మోయించుకోవడమే.

ముల్కిరూల్స్ అనేవి గవర్నమెంట్ ఉద్యోగాలకు మాత్రమే పరిమితం! ఈ ప్రభుత్వోద్యోగాలు ఎదుగూ బొదుగూ లేనివి. ఏటేటా క్రొత్తగా ఉద్యోగ పుష్పాలు విరివిగా పూచే కల్పవృక్షంగాదిది. మరి ఉన్న ఉద్యోగాల్లో కొన్నింట్లోని ఆంధ్రుల్ని సర్కారు జిల్లాలకు పంపేసి అందులో తెలంగాణా వారిని పెట్టాక మిగిలిన నిరుద్యోగుల మాటేమిటి? వారికి ఉద్యోగాలిచ్చి ఆదుకునే దెవ్వరు? సెక్రటేరియటా? లేక పరిశ్రమలా? పాలకులను పరిశ్రమల కోసం, క్రొత్త ఉద్యోగాల కోసం ఎందుకు నిలదీసి అడగరు. పెట్టిన ఆ కొద్ది పరిశ్రమలలో న్యాయమైన వాటాకోసం ఎందుకు ప్రశ్నించరు? తమకు న్యాయంగా పాలకుల నుండి అందవలసి ఉన్నదానిని పొందేందుకు అందరూ కలసి ఏకంగా ఎందుకు పోరాడరు?

విభజించి పాలించమనే బ్రిటిష్‌వారి రాజనీతిని తెలివిగా ప్రయోగిస్తున్న మన టోపీదాసుల పీడను ఈ జాతి ఎప్పుడు విరగడ చేసుకునేటట్లు?

తమ నిరుద్యోగానికీ, దారిద్ర్యానికి మూలం తోటి ప్రజలుగానీ, ఉద్యోగులుగానీ కాదనీ తమను దోచుకు తినేందుకే ఉన్న ధనికవర్గం మాత్రమేననీ ఈ అమాయక జాతి ఎప్పుడు గ్రహించేట్టు?

(డిశంబర్, 1972)